క్లుప్తంగా

నేడు విద్యుత్ అదాలత్

తిర్యాణి: వినియోగదారుల విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు గాను శనివారం మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



కాలిపోయిన సామగ్రి

దహెగాం: మండలంలోని గిరవెల్లి గ్రామానికి చెందిన కాసనగొట్టు చంద్రశేఖర్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ మంటలు చెలరేగాయి. ఇంట్లోని సామగ్రి కూలర్, బీరువా, బట్టలు కాలిపోవడంతో పాటు కొంత నగదు కూడా మంటల్లో దగ్ధమైందని వాపోయాడు. రెవెన్యూ, విద్యుత్ అధికారులకు సమాచారం అందించామన్నారు. ఆర్ఐ నాందేవ్ సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించినట్లు తెలిపారు.

సిద్ధేశ్వర సన్నిధిలో జాగరణ



పూజలు చేస్తున్న గిరిజనులు

పెంచికల్‌పేట్: సిద్ధేశ్వర సన్నిధిలో దేవతామూర్తులతో ఆదివాసీలు గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు జాగరణ చేశారు. మెరెగూడ సమీపంలోని ఆదివాసీల ఆరాధ్య దైవం గొంతెమ్మ బోనాలకు ముందు గొంతెమ్మ, భీమదేవర, లక్ష్మీదేవర, పోతరాజు, గొరుగొడ్డు మూర్తులకు గుండాల్లో పవిత్ర స్నానాలను చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆటపాటలు, విన్యాసాలు, పాటలు, భజనలతో సిద్ధేశ్వర గుహల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

చింతలమానెపల్లి మండల బీజేపీ అధ్యక్షుడిగా రామన్న



రామన్న

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి మండల బీజేపీ అధ్యక్షుడిగా డోకె రామన్నను శుక్రవారం నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌కు, బీజేపీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు.

రెబ్బెన మండల అధ్యక్షుడిగా రాంబాబు



ఎన్నిక పత్రం అందుకుంటున్న రాంబాబు

రెబ్బెన: బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా మల్లరాజు రాంబాబు ఎన్నికయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా సహా ఎన్నికల అధికారి దోని శ్రీశైలం శుక్రవారం మండల అధ్యక్షుడి ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని రాంబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మండలంలో బీజేపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడి ఎన్నికయ్యేందుకు కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ఎంపీ గోడం నగేశ్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు, మండల ఎన్నికల ఇన్‌చార్జి బోనగిరి సతీశ్‌బాబు, జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌కుమార్, రాష్ట్ర ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్‌కుమార్, జిల్లా సహాయ ఎన్నికల అధికారి శ్రీశైలం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా భిక్షపతి

నార్నూర్: బీజేపీ మండలాధ్యక్షుడిగా మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన రాథోడ్ భిక్షపతిని కుమురంభీం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మాట్లాడు తూ ఏజెన్సీలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా గ్రా మస్థాయి నుంచి పార్టీని నిర్మాణం చేస్తామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బెజ్జూర్: మండలంలోని ఏటిగూడ గ్రామానికి చెందిన ఏర్నాగి చిన్నన్న అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం బీజేపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. బీజేపీ నాయకులు అదే అశోక్, జలపతి, శంకర్, రాములు, అన్నారం తిరుపతి, సామల తిరుపతి పాల్గొన్నారు.

జాతరలో భక్తుల సందడి



దేవతలకు పూజలు చేస్తున్న భక్తులు



నృత్యం చేస్తున్న యువకులు



మైసమ్మకు పూజలు చేస్తున్న ఆదివాసీలు

కెరమెరి మండలంలోని ఇందాపూర్, సావర్‌ఖెడా గ్రామాల సమీపంలో ఉన్న పోతురాజు, ధర్మరాజు ఆలయానికి భక్తులు పోటెత్తారు. గురువారం ప్రారంభమైన జాతర వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం అనేక గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి దేవతలను దర్శించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి వివిధ రకాల వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు తమకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. హోటళ్లు, గాజుల దుకాణాలు, బోళ్లు, ఆట వస్తువుల షాపుల వద్ద ప్రజలు సందడి చేస్తున్నారు. కాగా దైవ దర్శనానికి భక్తులు పెద్దఎత్తున క్యూకట్టారు. మైసమ్మకు, పితృదేవతలకు, ఆలయం వెలుపల ఉన్న దేవతలకు భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటున్నారు. – కెరమెరి



బోళ్ల దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి



ఆట వస్తువులు కొనుగోలు చేస్తున్న మహిళలు



గాజుల దుకాణాల వద్ద మహిళలు

మాలీ సంఘం నాయకులకు సన్మానం



సన్మానిస్తున్న మాలీ సంఘం సభ్యులు

రెబ్బెన: ఇటీవల జరిగిన మాలీ సంఘం ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన లెండుగూరే శ్యాంరావుతో పాటు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అదే వసంత్‌రావులను శుక్రవారం మండల మాలీ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు జిల్లా అధ్యక్షుడు షిండే వాసు, ప్రధాన కార్యదర్శి నికోడే గంగారాం, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–4 ఫలితాల్లో ఉద్యోగం సాధించిన గంగాపూర్‌కు చెందిన గుర్లె శిరీషలను ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని మాలీ కులస్తులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. మాలీ కులస్తులు తమ పిల్లలకు ఉన్నతవిద్యను అందించి వారి భవిష్యత్తుకు బంగారుబాటలు వేయాలని సూచించారు. మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు గంటుమేర, శంకర్, రమేశ్, పోషం, మహేశ్, తిరుపతి, హన్మంతరావు, కాంతారావు, భీంరావు, నగేశ్, వడాయి మాధవి తదితరులు పాల్గొన్నారు.

నేడు సభ్యులకు సన్మానం

కౌటాల: మాలీ సంఘం రాష్ట్ర, జిల్లా నూతన కమిటీల్లో ఎన్నికైన సభ్యులను శనివారం కౌటాల మాలీ సంఘం ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు నిర్వాహకులు మోర్లె పాండురంగ్ శుక్రవారం తెలిపారు. సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడు లెండుగురే శ్యామ్‌రావ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావ్, జిల్లా అధ్యక్షుడు సెండె వాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి నికోడే గంగారంలను సన్మానించనున్నట్లు తెలిపారు. నేడు మధ్యాహ్నం 2 గంటలకు కౌటాల మాలి సంఘం భవనంలో కార్యక్రమం ఉంటుందని, మండలంలోని మాలి కులస్తులు, నాయకులు అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: పేదలకు సేవ చేయడమే లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండలంలోని జెండాగూడ, మొర్రిపేట్, శివగూడ గ్రామాలలోని కొలాం, నాయక్‌పోడ్ గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామాలలో పెరుగుతున్న చలిని దృష్టిలో ఉంచుకొని పేదలకు, నాయకపోడు గిరిజనులకు తమవంతుగా దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంత్‌రావు, ఆర్టీఏ జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్, ఖయ్యుం, ఎక్బాల్, భీమన్న, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దుతాం..

గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో రూ.20 లక్షల వేయంతో నిర్మించనున్న సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమి పూజ చేశారు. ప్రతీ గ్రామంలో రోడ్డు, డ్రెయినేజీ, నీటి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని పక్కగా అమలు చేస్తున్నామన్నారు.

పకడ్బందీగా సర్వే చేపట్టాలి



సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో అంజద్‌పాషా



సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

కెరమెరి: ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించేందుకు చేపట్టిన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. శుక్రవారం మండలంలోని ఖైరీ, ఆగుర్‌వాడ, గోండ్‌గూడల్లో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. రైతుభరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డులకు అర్హులైన లబ్ధిదారుల కోసం చేపడుతున్న సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. ఇంటి యజమానుల వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు, వ్యవసాయాధికారులు ఉన్నారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): మండలంలోని సిర్పూర్(టి), చీలపల్లి గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్న ప్రభుత్వ పథకాల నూతన రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణలు ఇంటింటా తిరిగి పరిశీలించారు. సర్వేలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఇంటింటా తిరిగి దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, జూనియర్ అసిస్టెంట్ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా కంపెనీ క్వార్టర్ల కేటాయింపులు



ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన: సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపడుతున్నామని బెల్లంపల్లి ఏరియా ఎస్వోటూ జీఎం రాజమల్లు అన్నారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియాలో ఖాళీగా ఉన్న కంపెనీ క్వార్టర్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ధ్రువపత్రాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కంపెనీ క్వార్టర్ల కేటాయింపులో సంస్థ నిర్ణయించిన నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తున్నామన్నారు. క్వార్టర్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా కౌన్సెలింగ్ పద్ధతిలోనే క్వార్టర్లను కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. సీనియార్టీ ప్రతిపాదికన అర్హులైన ఉద్యోగులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. క్వార్టర్ల కోసం ఉద్యోగులు మధ్యవర్తులను ఆశ్రయించొద్దని సూచించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఎస్ఈ సివిల్ మదీనాబాషా, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ సాయి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



విజేతలకు బహుమతి అందజేస్తున్న కోనేరు కృష్ణారావు

బెజ్జూర్: మండలంలోని తలాయి గ్రామంలో కోనేరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామస్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి హాజరైన జెడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు విజేతలకు బహుమతులు అందజేశారు. విజేత తలాయి ఏ జట్టుకు, రన్నరప్‌గా నిలిచిన తలాయి బీ జట్లకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. యువత క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బషరత్ ఖాన్, పుల్లూరి సతీశ్, వెంకన్న, శ్రీనివాస్, ఇస్తారి, సకారం, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఏఎస్సైకి సన్మానం



సన్మానిస్తున్న సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఎస్సైగా పదోన్నతి పొందిన లక్ష్మణ్‌ను శుక్రవారం రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్‌లు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పదోన్నతులతో ఉద్యోగుల బాధ్యతలు రెట్టింపవుతాయన్నారు. అంకితభావంతో పని చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాష్ట్రకు బస్సు లేక తిప్పలు

- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న సరిహద్దు గ్రామాల ప్రజలు
- ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకోలు



వెంకట్రావ్‌పేట్ -పోడ్సా అంతర్రాష్ట్ర రోడ్డు

సిర్పూర్(టి): మండల కేంద్రం నుంచి మహారాష్ట్రకు బస్సు సౌకర్యం కల్పించాలని మండలవాసులతో పాటు కౌటాల, బెజ్జూర్, కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, దహెగాం, చింతలమానెపల్లి మండలాల ప్రజలు కోరుతున్నారు. మండలం సరిహద్దుగా మహారాష్ట్ర గ్రామాలతో పాటు మహారాష్ట్రలోని వీరూర్, రాజూరా, బల్లార్షా, చంద్రపూర్, గోండ్‌పిప్రి, అహెరి పట్టణాలకు ప్రధాన రహదారులు ఉండగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం మహారాష్ట్రకు జిల్లావాసులు ప్రయాణాలు చేస్తుంటారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలకు అధిక చార్జీలు చెల్లించి ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. మహారాష్ట్రలోని రాజూరా డిపోకు చెందిన బస్సు ప్రతిరోజు ఉదయం మాత్రమే సిర్పూర్(టి) -మాకిడి అంతర్రాష్ట్ర రహదారి గుండా రాజూరా పట్టణానికి కొనసాగిస్తున్నారు. ఒక రహదారి గుండా రాజూరా పట్టణానికి మాత్రమే మహారాష్ట్ర బస్సు సౌకర్యం ఉందని, వెంకట్రావ్‌పేట్ -పోడ్సా అంతర్రాష్ట్ర రహదారి గుండా గోండ్‌పిప్రి, అహెరీ, గడ్చిరోలీ జిల్లాలకు బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రం నుంచి మహారాష్ట్రలోని పట్టణాలు రాజూరా, బల్లార్షా, చంద్రపూర్, గోండ్‌పిప్రిలకు ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆసిఫాబాద్ డిపో అధికారులు పలు దఫాలు సర్వేలు నిర్వహించి హామీలు ఇచ్చినప్పటికీ బస్సు సౌకర్యం మాత్రం కల్పించలేదు.

సౌకర్యం కల్పించాలి



సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా సరిహద్దున ఉన్న మహారాష్ట్ర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో మహారాష్ట్ర గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసిఫాబాద్ డిపో అధికారులు స్పందించి మహారాష్ట్ర గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి. – కిర్మరే శ్యామ్‌రావ్, సిర్పూర్ (టి)

ఇబ్బందులు పడుతున్నాం..



మండల కేంద్రం నుంచి మహారాష్ట్రలోని పట్టణాలు గోండ్‌పిప్రి, రాజూరా, చంద్రపూర్‌లకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని అధికారులు పలు దఫాలు సర్వేలు చేసి హామీ ఇచ్చారు. కానీ నేటికీ బస్సు సౌకర్యం కల్పించలేదు. ప్రైవేట్ వాహనాలతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి.

– ఎర్ర మల్లేశ్, సిర్పూర్(టి)

మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు



ముగ్గు పోస్తున్న అధికారులు

నార్నూర్: తొడసం వంశీయుల ఆరాధ్యదైవం ఖందేవ్ ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు శుక్రవారం ఎంపీడీవో జవహర్, ఎస్‌బీఎం రాథోడ్ సందీప్‌లు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నా గోరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. రూ.3 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణా నికి నిధులు మంజూరు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో సురేశ్, టీఏలు జాదవ్ కైలాస్‌నాయక్, సచిన్, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



భీమయ్యక్ ఆలయంలో మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉల్లిపిట్ట గ్రామంలోని భీమయ్యక్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. నాయకులు రంజిత్ బీము, రాము దినకర్ పాల్గొన్నారు.

మాదిగ మహా సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

కౌటాల: మండల కేంద్రంలో శుక్రవారం మాదిగ సంఘం మహా కూటమి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ మండలాధ్యక్షుడిగా ఇప్ప తిరుపతి, గౌరవ అధ్యక్షుడిగా సిద్దల బాపు, ఉపాధ్యక్షులుగా నక్క మహేశ్, రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా స్వామి, ప్రచార కార్యదర్శిగా తిరుపతిలను ఎన్నుకున్నారు. ఎస్సీల సమస్యల పరిష్కరానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల కమిటీ జిల్లా అధ్యక్షులు రెగుంట రాజలింగు, నాయకులు ఇరిగిరాల భాస్కర్, శ్రీమాన్, నక్క సుధాకర్, పురుషోత్తం, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండలస్థాయి క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న నాయకులు

సిర్పూర్(టి): సంక్రాంతి పురస్కరించుకుని మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ మైదానంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. గెలుపొందిన సిర్పూర్(టి) స్ట్రైకర్స్ జట్టుకు స్థానిక నాయకుడు సోహెల్ అహ్మద్ షీల్డుతో పాటు రూ. 21వేల నగదు, రన్నరప్ డాల్ఫిన్ డాలీ జట్టుకు కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్ షీల్డు, రూ. 15వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సోహెల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.